ప్రగతి పథంలో ఆత్మకూరు

● మున్సిపల్, ఫైనాన్స్ నిధులతో అభివృద్ధి పనులు
● అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ ప్రగతి పథంలో పరుగులు తీస్తోంది. స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో దాదాపు 20 వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. వివిధ కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. పనులు నాణ్యతగా జరిగేలా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, మున్సిపల్ అధికారులు దగ్గరుండి అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. అలాగే పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే అధికంగా అభివృద్ధి పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధి వైపు దూసుకెళ్తోంది. టీడీపీ ప్రభుత్వంలో నగర పంచాయతీగా ఉన్న ఆత్మకూరును మున్సిపాలిటీగా మారుస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీఓను విడుదల చేసింది. ఆత్మకూరు మున్సిపాలిటీలో ఉన్న నిధులతో పాటు ప్రభుత్వం అందించే ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. 2019లో 14 వ ఫైనాన్స్ నిధుల కింద కళాంజోరి గ్రాఫిక్ నుంచి ధర్మారెడ్డి ఇంటి వరకు వార్డు 19లో రూ.5 లక్షలతో, అదే ఏడాది గంగమ్మ ఇంటి నుంచి ముర్తుజావలి ఇంటి వరకు రూ.6 లక్షలు, 2021- 22లో సుభాని ఇంటి నుంచి కోనేరు పబ్లిక్ స్కూల్ వరకు రూ.21 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం ఆత్మకూరు పట్టణంలోని అభివృద్ధి పనులు తీరును పరిశీలిస్తే 14వ ఫైనాన్స్ నుంచి 48 పనులకు రూ.3కోట్ల 78 లక్షలు, మరో 60 పనులకు రూ.2 కోట్ల 70 లక్షలు, ఎస్ఎస్‌సీ కింద మూడు పనులకు సంబంధించి రూ.75 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద 58 పనులకు రూ.కోటి 60లక్షలు, వైఎస్సార్ అర్బన్ హెల్త్ కేంద్రానికి రూ.80 లక్షలు చొప్పున నిధులు మంజూరు అయ్యాయి. పట్టణంలోని 24 వార్డుల్లో 20 వార్డుల్లో సీసీ రోడ్లు నిర్మించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.9కోట్ల 63 లక్షలతో అభివృద్ధి పనులు జరిగాయి.

మంచినీటి సమస్య పరిష్కారం కోసం ప్రణాళిక

ఆత్మకూరు పట్టణంలో వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచినీటి సమస్య పరిష్కారం కోసం దాదాపు రూ.25 లక్షలతో మంచినీటి సరఫరాకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశారు. నీటి సమస్య ఏర్పడితే ఆయా కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలో ఈ ఏడాది నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.




16వ వార్డులో క్యూరింగ్‌లోఉన్న సీసీ రోడ్డు, పట్టణంలోని 14వ వార్డులో డ్రైనేజీ పనులు



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కో ఆప్షన్ మెంబర్ రషీద్

అన్ని రంగాల్లో అభివృద్ధి



ఆత్మకూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రయతిస్తున్నాం. అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాట్లు చేశాం. ఆత్మకూరును అభివృద్ధిలో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాం.

–ఆసియామారూఫ్, మున్సిపల్ చైర్‌పర్సన్, ఆత్మకూరు

అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణంలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు వేశారు. గతంలో పలు వార్డుల్లో సీసీ రోడ్లు లేక ఇబ్బందులు పడేవాళ్లం వర్షా కాలంలో రోడ్ల వెంట బురదలో నడుచుకుంటూ ఇళ్లకు వెళ్లేందుకు అవస్థలు పడాల్సి వచ్చేది. వాహనాలు వెళ్లేందుకు ఎంతో అసౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం సీసీ రోడ్లు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది.

–తిమోతి, ఆత్మకూరు

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



బోధనంలో ప్రజలకు సూచనలిస్తున్న ఎస్ఐ మల్లికార్జున

మహానంది: ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని బండిఆత్మకూరు ఎస్ఐ మల్లికార్జున సూచించారు. బండిఆత్మకూరు మండలం బోధనం, శింగవరం గ్రామాల్లో సోమవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా ఓటర్లను బెదిరించినా, ప్రలోభ పెట్టినా ఎన్నికల నియమావళి చట్టాల ప్రకారం కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు

వెలుగోడు: సార్వత్రిక ఎన్నికల్లో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని వెలుగోడు ఎస్ఐ భూపాలుడు హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో ధైర్యం నింపేందుకు సోమవారం సాయంత్రం మండలంలోని రేగడ గూడూరు, వేల్పనూరు, అబ్దుల్లాపురం గ్రామాలలో బీఎస్ఎఫ్ డీఎస్పీ పంకజ్ కుమార్, బీఎస్ఎఫ్ సిబ్బంది, వెలుగోడు పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

క్లుప్తంగా

పైపులైన్ పనులు పూర్తి చేయాలి



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలోని బీసీ కాలనీలో జరుగుతున్న నూతన పైపులైన్ పనులను గుత్తేదారులు త్వరగా పూర్తి చేయాలని గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అయ్యపురెడ్డి కోరారు. సోమవారం గ్రామంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఈ నూతన పైపులైన్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగేశ్వరరావు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కలమందలపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలు, తీసుకోని పక్షంలో కలిగే నష్టాలను వివరించారు. బాల్య వివాహాలను అరికట్టాలని, సమాజంలో బాలికల పట్ల వివక్ష చూపరాదని సూచించారు. అదేవిధంగా మిడుతూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు.

హెచ్‌బీఏ1సీ టెస్టు చేయించుకోవాలి



గువ్వలకుంట్లలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కొత్తపల్లి: గ్రామాలలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో షుగర్ పరీక్షలు చేయించుకున్నవారు హచ్‌బీఏ1సీ టెస్టు తప్పకుండా చేయించుకోవాలని కొత్తపల్లి వైద్యాధికారి దీపానాగవేణి తెలిపారు. సోమవారం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గువ్వలకుంట్ల, వీరాపురం, బండినాయిని పాలెం గ్రామాలలో వైద్యబృందంచే వైద్యపరీక్షలను చేయించారు. ఆమె మాట్లాడుతూ పరీక్ష నిమిత్తం ఆయా గ్రామాలలో 60 మందికి శాంపుల్స్ తీశామని చెప్పారు. వీరికి వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వమే ఉచితంగా మందులను పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరిత, ఎంఎల్‌హెచ్‌పీ శైలజ, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వివక్ష లేకుండా ఆడపిల్లలను పెంచాలి



కొత్తపల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

కొత్తపల్లి: ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులు లింగ వివక్ష లేకుండా ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా పెంచాలని, ఆడపిల్లలు చట్టాలు తెలుసుకొని అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. సోమవారం మండలంలోని నందికుంట గ్రామంలో ఉన్న పాఠశాలలో బేటి బచావో బేటి పఢావో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వో కృష్ణారెడ్డి, పంచాయతీ సెక్రటరీలు, రాఘవేంద్ర, ప్రసాదు, మహిళా పోలీస్ మోతియా బేగం పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

ఆత్మకూరు: రంజాన్ పర్వదినం సందర్భంగా పేద మహిళలకు బీజేపీ నాయకురాలు మోమిన్ షబానా సోమవారం చీరలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ తన సంపాదనలో కొంత భాగం వెచ్చించి రంజాన్ సందర్భంగా పేదలకు చీరలు పంపిణీ చేశానన్నారు. కొత్తపేట మసీదుతో పాటు పట్టణంలోని పలు మసీదుల వద్ద, తమ గోడౌన్‌వద్ద పేద మహిళలకు దాదాపు 10వేలకు పైగా చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

మహానందిలో భక్తుల సందడి



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

మహానంది: మహానందిలో సోమవారం భక్తుల సందడి కనిపించింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడుతున్నాయి. ఆలయానికి వచ్చిన భక్తులు కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, అర్చనలు చేశారు. ఆలయంలో ఉదయం నుంచి రద్దీ నెలకొంది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ ఈఓ కాపు. చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. నిరంతర దర్శనం ఏర్పాటు చేశారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర అవధాని, శాంతారాంభట్, హనుమంతు శర్మ, అర్చకులు శరభయ్యశర్మలు మహానందీశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో పల్లకీలో కొలువైన స్వామి, అమ్మవార్లకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, హారతిపూజలు, అలంకార, ఉత్సవ పూజలు నిర్వహించారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది.

ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆత్మకురు డీఎస్పీ శ్రీనివాసరావు

మిడుతూరు: ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం ఓ కేసు విచారణ నిమిత్తం ఆయన మిడుతూరు పోలీస్ స్టేషన్‌కు విచ్చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించేంత వరకు కలిసి మెలసి ఉండాలని సూచించారు. పోలింగ్ రోజు నచ్చిన వారికి ఓటు వేసుకునేందుకు ప్రశాంతవాతావరణం కల్పిస్తామని చెప్పారు.

వంట నిర్వాహకుల ఫిర్యాదుపై విచారణ

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2017-18 విద్యా సంవత్సరంలో మధ్యాహ్న భోజనం బిల్లులో కొంత మొత్తాన్ని తమకు తెలియకుండా ఎస్‌బీఐ బ్యాంకులో విత్‌డ్రా చేసుకున్నారని వంటనిర్వాహకులు స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై డీఎస్పీ.. వంటల నిర్వాహకులను విడి విడిగా విచారించారు. అదేవిధంగా పాఠశాలలో ఆ సమయంలో విద్యార్థులకు సంబంధించిన వివరాలపై పాఠశాల సిబ్బందిని, ఎస్‌బీఐ బ్యాంకు సిబ్బందిని ఆరాతీశారు. తుది నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు.

చూచిరాతలకు చోటివ్వొద్దు

మిడుతూరు: పదో తరగతి పరీక్షా కేంద్రాలలో చూచిరాతలకు చోటు ఇవ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఫ్లైయింగ్ స్క్వాడ్ శంకర్ ప్రసాద్ పరీక్షల నిర్వహణ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, కడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షాకేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాలను పరిశీలించారు. పరీక్షా నిర్వహణ అధికారులు మల్లికార్జున నాయక్, సాయితిమ్మయ్య, రవిప్రకాష్ రావు, డిపార్టుమెంటల్ అధికారులు పీఎండీ రఫి, భరత్ భూషణ్, ముజుబుర్ రహిమాన్ ఉన్నారు.

తొలి రోజు పరీక్షలు ప్రశాంతం

ఆత్మకూరు: పట్టణంలో సోమవారం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాసేందుకు విద్యార్థులు నిర్ణీత సమయంలో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 201 మంది విద్యార్థులకు గాను 184మంది, బాలికల హైస్కూల్‌లో 209కి గాను 195 మంది, చైతన్య హైస్కూల్ 201కి గాను 181 మంది, గౌతమి హైస్కూల్‌లో 185కు గాను 171 మంది హాజరయ్యారు. అలాగే ఉర్దూ హైస్కూల్‌లో 266మందికి గాను 252మంది, డీపాల్ హైస్కూల్‌లో 229మందికి గాను 215 మంది, పద్మావతి హైస్కూల్‌లో 163మంది పరీక్షలు రాశారని ఎంఈఓ జానకీరాం తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామ పంచాయతీ 4వ వార్డు సభ్యురాలు షేక్‌జైనుబీ భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ మునాఫ్(66) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. గ్రామ సర్పంచు నాయిని సావిత్రమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మధుసూదన్‌రావు మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి మునాఫ్ ఎంతగానో కృషి చేశాడన్నారు.

కొణిదేలలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



ఆలయంలో కొలువైన శివలింగం

నందికొట్కూరు రూరల్: మండలంలోని కొణిదేల గ్రామంలోని శ్రీమత్కొణిదేల భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఆరు రోజుల పాటు రోజుకో ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసినట్లు ఆలయ అధికారులు, నిర్వాహకులు తెలిపారు.

బ్రహోత్సవాల్లో నిర్వహించే కార్యక్రమాలు .

మంగళవారం అక్షతారోహణం రాత్రి 11 నుంచి 11.50 గంటల వరకు స్వామి అమ్మవార్ల కల్యాణం , 20న గజారోహణం, 21న ప్రభోత్సవము, 22న రథోత్సవం, 23న పారువేట, 24న వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈఓ కార్తిక్ తెలిపారు.

టీడీపీ, బీజేపీ పొత్తు రాష్ట్రానికి చేటు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్

ఆత్మకూరు: రాష్ట్రంలో ఎన్నికల తరుణంలో టీడీపీ, జనసేనలు బీజేపీతో పొత్తు పెట్టుకోవడం రాష్ట్రానికి చేటని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో సోమవారం సీపీఎం పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఇవ్వని బీజేపీతో రాష్ట్రంలోని టీడీపీ, జనసేనలు పొత్తుపెట్టుకున్నట్లు చంద్రబాబు ప్రకటించడం తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టడమేనన్నారు. రాష్ట్ర ప్రజలతో తిరస్కరించబడిన బీజేపీతో టీడీపీ ఎందుకు పొత్తు పెట్టుకుందో సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలుగు ప్రజలు టీడీపీ, బీజేపీకి బుద్ధి చెప్పాలని, వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రణధీర్, సీనియర్ నాయకులు రాజశేఖర్, ఏసురత్నం, స్వాములు, రాంనాయక్, సంజీవరాయుడు, సురేంద్ర, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పెచ్చెర్వు చెంచుగూడెంలో వైద్య శిబిరం

ఆత్మకూరు: మండలంలోని పెచ్చెర్వు చెంచుగూడెంలో సోమవారం చెంచు గిరిజనులకు కొట్టాలచెరువు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి సుప్రవల్లిక మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఏ చిన్న సమస్య వచ్చినా సమీపంలోని పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించడమే కాకుండా గూడెంలో ఇంటింటా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. బీపీ, షుగర్, హెచ్‌బీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చెంచు పిల్లలకు టీకాలు వేశారు. వైద్యసిబ్బంది విజయలక్ష్మి, తులసి, రవికుమార్, మల్లిక, మౌనిక, సామక్క పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం సాగించండి

కొత్తపల్లి: గ్రామాలలోని ప్రజలు ప్రశాంతమైన జీవనం సాగించాలని ఎస్ఐ హరిప్రసాద్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని ఎర్రమఠం గ్రామంలో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల నియామవళిని ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. పల్లెల్లో అల్లర్లు, ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలు వంటి వాటిని ప్రోత్సహిస్తే కఠిన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ప్రజలందరూ ఎన్నికల నియామవళికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ ఓబులేసు, సిబ్బంది ప్రసాద్‌నాయక్, గ్రామప్రజలు ఉన్నారు.

ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు



గోకవరం పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



వెలుగోడు జెడ్పీ హైస్కూల్‌లో హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

నందికొట్కూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 1,129 మంది విద్యార్థులకు గాను 1,075 మంది హాజరయ్యారు. మిగతా ఐదు మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు ఎంఈఓ-2 శ్రీనివాసులు తెలిపారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 220 మందికి 214, గవర్నమెంట్ హైస్కూల్‌లో 223-216, విజయవాణి ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో 185-176, నవనంది హైస్కూల్‌లో 201-188, చైతన్య స్కూల్‌లో 160-150, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(కోట)-144-131 హాజరయ్యారని వెల్లడించారు. విద్యార్థులకు పరీక్షల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొత్తపల్లిలో 238 మంది హాజరు

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గోకవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. ఈ రెండు పరీక్ష కేంద్రాలలో మొదటి రోజు తెలుగు పరీక్షకు 289 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 238 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ మహానంది ఎంఈఓ రామసుబ్బయ్య, ఎస్సార్‌బీసీ స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ ధర్మేంద్ర ఫణి తనిఖీ చేశారు. పరీక్షలను డిపార్ట్‌మెంట్ అధికారులు ఖాజా మొయిద్దీన్ , సురేంద్ర సింగ్ పర్యవేక్షించారు.

36మంది విద్యార్థులు గైర్హాజరు

పాములపాడు: మండల కేంద్రంలో రెండు పరీక్షా కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన 10వ తరగతి తెలుగు పరీక్షకు 36 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ బాలాజీనాయక్ తెలిపారు. ఏఎస్ఆర్ జెడ్పీ హై స్కూలు పరీక్షా కేంద్రంలో 198 మందికి గాను 188 మంది , ఏపీ మోడల్ స్కూలు పరీక్షా కేంద్రంలో 247కు గాను 221 మంది చొప్పున విద్యార్థులు పరీక్ష రాశారని వివరించారు. ఎస్ఐఅశోక్ తన సిబ్బందితోరెండు పరీక్షాకేంద్రాలను పరిశీలించారు.

పగిడ్యాల మండలంలో..

పగిడ్యాల: మండలంలోని పగిడ్యాల, పాత ముచ్చుమర్రి, లక్ష్మాపురం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో సోమవారం ప్రారంభమైన 10 వతరగతి పబ్లిక్ పరీక్షలకు 16 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ సుభాన్ తెలిపారు. 3 పరీక్షా కేంద్రాల్లో 534 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 518 మంది హాజరయ్యారు.

ప్రశాంతంగా పరీక్షలు

వెలుగోడు: పట్టణంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డిపాల్, ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 239 మంది హాజరుకావాల్సి ఉండగా 227 మంది పరీక్షలు రాసినట్లు చీఫ్ సూపరిన్‌టెండెంట్ మగ్బూల్ తెలిపారు. పరీక్షలకు పార్థసారథిరెడ్డి, రవిశంకర్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా వ్యవహరించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో 240 మందికి గాను 225 మంది, ఉర్దూ మీడియంలో 22కి మంది గాను 21 మంది పరీక్షలు రాశారు. సప్లిమెంటరీలో 70 మంది పరీక్షలకు హాజరయ్యారని సూపరింటెండెంట్ రఫీక్ అహ్మద్ తెలిపారు. డీపాల్ స్కూల్‌లో 263 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 235 హాజరయ్యారని సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు.

ఉత్సాహంగా కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో పది పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మహానంది మండలం గాజులపల్లెలో రెండు, తిమ్మాపురంలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశా రు. బండిఆత్మకూరు మండలంలో బండిఆత్మకూ రు, సంతజూటూరు, ఏపీ మోడల్ స్కూల్‌లో కేంద్రా ల్లో పరీక్షలు జరిగాయి. ఈ మేరకు విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షా సమయానికంటే ముందుగా హాజరై తమ సీట్లను చూసుకున్నారు. బండిఆత్మకూరు మండలంలో 518 మంది హాజరవ్వగా 72 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. మహానంది మండలంలో 60 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. మహానంది మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలో మొదటి సారి పరీక్ష కేంద్రం ఏర్పాటు కావడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

■ **జూపాడుబంగ్లాలో 46 మంది గైర్హాజరు**

జూపాడుబంగ్లా: మండలకేంద్రమైన జూపాడు బంగ్లాలో గురుకుల, ప్రభుత్వ ఉన్నత, మోడల్ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. మొదటి రోజు పరీక్షను రాయటానికి వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఉదయం 8.30గంటలకే పరీక్షాకేంద్రాల వద్దకు చేరుకున్నారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తుతో పాటు మహిళా పోలీసులను నియమించారు. అలాగే మెడికల్ క్యాంపులు, తాగునీటి వసతి కల్పించారు. మొదటి రోజు గురుకుల పాఠశాలలో 135మందికి గాను 127మంది, ఉన్నత పాఠశాలలో 139మందికి గాను 122 మంది, మోడల్ పాఠశాలలో 189 మందికిగాను 168మంది హాజరయ్యారని పరీక్షా కేంద్రాల చీఫ్‌లు వెల్లడించారు. పరీక్షాకేంద్రాలను నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్ సోమవారం తనిఖీ చేశారు. ఏఎస్ఐ మేరీజయంతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జూపాడుబంగ్లా పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ విజయభాస్కర్

నందికొట్కూరులో సినిమా షూటింగ్



మాట్లాడుతున్న డైరెక్టర్ సుభాష్‌బాబు

నందికొట్కూరు: చిన్మయి క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్న రాజధానిలో ఒక్కడు చలన చిత్రం షూటింగ్ ఏప్రిల్‌లో నందికొట్కూరు ప్రాంతంలో నిర్వహిస్తున్నట్లు సినిమా డైరెక్టర్ సుభాష్‌బాబు తెలిపారు. సోమవారం పట్టణంలోని 6వ వార్డు కౌన్సిలరు దేశెట్టి సుమలత స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డైరెక్టర్ మాట్లాడారు. ఈ ప్రాంతంలోనే 70 శాతం సినిమా చిత్రీకరిస్తామన్నారు. సినిమాలో ఈ ప్రాంతంలోని కొత్త వారికి అవకాశం కల్పిస్తునట్లు తెలిపారు. సినిమాకు శాప్ రాష్ట్ర చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చేతులమీదుగా క్లాప్ కొట్టించడం జరిగిందన్నారు. ఇందులో బాబు మోహన్, కోట శంకరావు, గీతాసింగ్, అరవింద్ అగర్వాల్, జబర్దస్త్ అప్పారావు, చిట్టిబాబు, మేఘనా చౌదరి, డాక్టర్ ఆర్ట్ శ్రీనివాసులు నటించనున్నారన్నారని చెప్పారు.

నాటుసారా స్వాధీనం

మిడుతూరు: నందికొట్కూరు పట్టణం షికారి పేటకు చెందిన షికారి ప్రసాదు అనే వ్యక్తిని నాగలూటి - నందికొట్కూరు క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకొని 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జగన్‌మోహన్ సోమవారం తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.